క్లుప్తంగా

బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా వెంకటరమణ

పాల్వంచరూరల్: బీజేపీ పట్టణ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలిగా నందిగం వెంకటరమణను నియమించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ శుక్రవారం ఆమెకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్, మాదారపు లక్ష్మణ్, బత్తుల వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి, మంగ పాల్గొన్నారు.

14న నీలి కవాతును జయప్రదం చేయండి

కొత్తగూడెంరూరల్: ఈనెల 14వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా హైదరబాద్‌లో బ్లూ మార్చ్ – నీలి కవాతును జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు జోగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో కవాతుకు మాదిగలు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిద్దెల రవి, వేల్పుల భాస్కర్, నరేష్, రాకేష్, రవికుమార్, జగన్, సురేష్, మల్లయ్య, వెంకటి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుజాతనగర్: 11 కేవీ విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సీతంపేట, సీతంపేట బంజర, రాఘవాపురం, లక్ష్మక్కపేట, నాయకులగూడెం, డేగలమడుగు, మద్రితండా, చింతల్‌తండా, నిమ్మలగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టేకులపల్లి: టేకులపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ హట్కర్ దేవా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 8 – 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సమాధుల కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందు: 120 ఏళ్ల చరిత్ర కలిగిన క్రైస్తవ సమాధుల దొడ్డిని ఓ వ్యక్తి కూల్చి వేశాడని విచారణ జరిపి అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇల్లెందు ఆర్‌సీఎం చర్చి సభ్యులు కోరారు. శుక్రవారం కొత్తగూడెంలో జిల్లా రెవెన్యూ అధికారి రవీంద్రనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మూడు రోజులుగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రొక్లెయినర్‌తో సమాధులను కూల్చి వేశాడని తెలిపారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో క్రైస్తవ సమాధుల దొడ్డి ఉందని, 120 ఏళ్ల నుంచి తాత ముత్తాల సమాధులు ఉన్నాయని, వాటిని తాము పవిత్రంగా పూజిస్తుంటామన్నారు. ఇల్లెందుకు చెందిన ఓ వ్యక్తి తమదే పట్టా భూమి అంటూ కూల్చి వేశాడని, ఇప్పుడు అక్కడ సమాధులను గుర్తు పట్టలేని పరిస్థితిలో ఉందన్నారు. తక్షణం విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై స్పందించిన డీఆర్‌ఓ రవీంద్రనాథ్ ఇల్లెందు తహసీల్దార్ రవికుమార్‌ను విచారణ జరిపి పూర్తి వివరాలతో రిపోర్టు అందజేయాలని కోరారు.

నృత్య ప్రదర్శనలను విజయవంతం చేయండి

పాల్వంచ: ఈనెల 29న ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే సందర్భంగా జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాల్వంచలో నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు బేర శ్రీలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల గురువులు, నృత్యకారులు తమ పేర్లను ఈనెల 20వ తేదీలోగా నమోదు చేసుకోవాలని ఎంట్రీ ఫీజు లేదని, వివరాలకు 7680025701 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పాలకులపై పోరాటాలకు సిద్ధం కావాలి

ఇల్లెందు(టేకులపల్లి): దేశవ్యాప్తంగా రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ రామ్ చందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో ఏఐకేఎస్ జెండాను ఎగురవేసి మాట్లాడుతూ.. అఖిలభారత కిసాన్ సభా కౌన్సిల్ నిర్ణయాలలో భాగంగా ఏప్రిల్ 12న ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని 1936 ఏప్రిల్ 12న అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉద్యమాలలో భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం చరిత్రాత్మకమైన పాత్రను నిర్వర్తించిందని పేర్కొన్నారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించే విధంగా పాలకులు, చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పాలకులను ఓడించాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో జి.కృష్ణ, రాములు, మోతీలాల్, బాబు, సోమన్న, భద్రయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈత సరదా.. అప్రమత్తతే సదా!

- సరదా మాటున పొంచి ఉన్న ప్రమాదం
- తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి



ఈత కొడుతున్న చిన్నారులు

ఇల్లెందురూరల్: వేసవి ప్రారంభమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండ వేడిమిని తట్టుకోలేక జనాలు అల్లాడుతున్నారు. పగటి ఉష్ణోగ్రత 40డిగ్రీలు దాటి నమోదవుతోంది. ఇటువంటి సమయంలో ఉక్కబోతతో ఏం చేద్దామన్నా మనసు ఒప్పదు. ఎండ వేడిమి, ఉక్కపోతకు తట్టుకోలేక పెద్దలు ఏదో ఒక చెట్టునీడన కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. కొంతమంది ఇళ్లలోనే ఉంటారు. యువకులు, చిన్నారుల ఆలోచనలు మాత్రం ఊరు దాటి చక్కర్లు కొడుతుంటాయి. ఈ నేపథ్యంలో వారు ఎంచుకునే మార్గం ఈత. దీనికోసం బావులు, చెరువులు, వాగులను ఆశ్రయిస్తుంటారు. ఈత నుంచి ఉక్కపోత, వేడిమి నుంచి ఉపశమనం అందకంటే ఉల్లాసం, ఉత్సాహం పొందవచ్చు. కానీ ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అనారోగ్యం, ప్రాణాపాయం చవిచూడాల్సి వస్తుంది.

జాగ్రత్తలు సూచిస్తున్నా ప్రమాదాలు...
మండలంలోని మామిడిగుండాల గ్రామంకు చెందిన ఎర్రిపోతు భిక్షపతి ఈత రాకున్నా సరదాగా డబ్బా నడుముకు కట్టుకొని బావిలోకి దిగాడు. డబ్బా మధ్యలోనే జారిపోవడంతో బావిలో మునిగి మృతి చెందాడు. గతేడాది మాణిక్యారం గ్రామపంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన పూనెం రాంబాబు అనే యువకుడు సరదాగా చెరువులో చేపలు పట్టుకుంటూ నీటిలో గడ్డిజాతి తీగలు కాళ్లకు చుట్టుకొని చెరువులో మునిగి మృతి చెందాడు. ఇలాంటి ప్రమాదాలు ప్రతీఏటా పలు గ్రామాలలో జరుగుతూనే ఉన్నాయి. మరో పదిరోజులలో విద్యార్థులకు వేసవి సెలవులు ఇస్తున్నారు. గతం మాదిరి కాకుండా ఈత సరదా మాటున చిన్నారులు, యువకులు ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా వేసవిలో చిన్నారుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈత రాకున్నా..
నీళ్లన్నా.. ఈత కొట్టడమన్నా సరదా పడే పిల్లలు గంటల తరబడి నీళ్లచెంతనే ఆడుతుంటారు. తోటి వారిని అనుకరిస్తూ ఈత రాకున్నా నీళ్లలోకి దిగుతూ ప్రమాదాల బారిన పడుతుంటారు. ఒకరిని రక్షించబోయి మరొకరు మునిగిపోతుంటారు. నీళ్లల్లో ఈత రాని వారు ఈత వచ్చినవారి మెడను గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరూ మునిగిపోతుంటారు. చెరువులు, కుంటల్లో బురదలో కూరుకుపోవడం, చేపలను పట్టే జాలీలు, గడ్డిజాతి తీగలు కాళ్లకు చుట్టుకోవడంతో ఈత వచ్చిన వారు కూడా ప్రమాదాల బారిన పడుతుంటారు.

తల్లిదండ్రుల సంరక్షణలో..
తల్లిదండ్రులు తమ సంరక్షణలో పిల్లలకు ఈత నేర్పాలి. అనుభవజ్ఞులైన వారిచే శిక్షణ ఇప్పించాలి. ఆడమగ తేడా లేకుండా పిల్లలకు తప్పనిసరిగా ఈత నేర్పితే భవిష్యత్‌లో నీటి ప్రమాదాలకు ఆస్కారముండదు. ఈతరాని వారు నీళ్ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

శుభ్రమైన నీటిలోనే ఈత కొట్టాలి..
బావుల్లో నీటిని ప్రజలు వాడకపోగా ఏ శుభకార్యం చేసినా పూలు, వస్త్రాలు, ఆకులు లాంటి పదార్థాలు నీళ్లలో వేస్తుంటారు. అడుగంటిన బావులు, చెరువులలో కూడా నీరు బురదమయంగా ఉంటుంది. దీంతో నీరు కలుషితంగా మారుతుంది. ఇటువంటి బావుల్లో ఈతకు వెళితే ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. మంచినీటి బావులు, చెరువులను ఎంచుకోవడం ఆరోగ్యపరంగా ఉత్తమం.

ట్రైర్లు, డబ్బాలతో ప్రమాదం...
చాలా గ్రామాలలో చిన్నారులు డబ్బాలను కట్టుకుని నీటిలో దిగుతుంటారు. అయితే నీటిలో తడవటం, డబ్బాలకు రంధ్రాలు పడటంతో లోతుకు వెళ్లిన చిన్నారులు నీళ్లలో మునిగిపోయే అకాశాలు ఉన్నాయి. సొరకాయ బుర్రలు, డబ్బాలను ఈత నేర్చుకునేందుకు వినియోగించరాదు.

నాణ్యమైన ట్యూబులు మేలు...
గాలి ట్యూబులను వాడినా నాణ్యత లేకుంటే మధ్యలోనే గాలిపోయి పిల్లలు మునిగిపోతుంటారు. ఈతకు వినియోగించేందుకు నాణ్యమైన గాలి ట్యూబులనే పిల్లలు ఉపయోగించాలి. సరిపడా సైజున్న ట్యూబులనే తీసుకోవాలి. వదులుగా ఉంటే పిల్లలు ట్యూబుల మధ్యలో నుంచి నీళ్లలోకి జారిపోయే ప్రమాదం ఉంది.



మామిడిగుండాలలో యువకుడి ప్రాణాలు మింగిన బావి

అప్రమత్తంగా ఉండాలి...



ఈత వల్ల ఆరోగ్యం ఎంతగా కుదుటపడుతుందో అంతే ఇబ్బందులు కూడా తప్పవని పెద్దలు గుర్తించాలి. ఈత సమయంలో చెవిలోకి నీరు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కలుషిత నీటి కారణంగా కళ్ల కలకలు, చర్మవ్యాధులు, చెవుల్లో చీము, పొరపాటుగా నీళ్లు తాగడం కారణంగా అతిసార లాంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పెద్దల పర్యవేక్షణలో ఈత కొట్టడం వల్ల ప్రమాదాలను అధిగమించవచ్చు.

– డాక్టర్ కవిత, వైద్యాధికారి, రొంపేడు పీహెచ్‌సీ, ఇల్లెందు

ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): ప్రజా సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం నిత్యం శ్రమించటమే కమ్యూనిస్ట్ పార్టీ శ్రేణులు, పార్టీ తరుపున గెలిచిన ప్రజా ప్రతినిధుల ప్రధాన అజెండాగా ఉంటుందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో శుక్రవారం నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ... పార్టీ కార్మికులు, కర్షకులు, శ్రామిక జీవుల కోసం ఆవిర్భవించిందన్నారు. ప్రజల కోసం పనిచేసే పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటానని, ఉద్యమాల ద్వారా మొద్దునిద్ర పోతున్న పాలకులను తట్టిలేపుతున్నామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు. కార్పొరేట్‌కు ఊడిగం చేస్తూ, కులమతాల్లో చిచ్చు పెడుతున్న బీజేపీని తరిమికొట్టాలన్నారు.

పార్టీలో పలువురి చేరిక...
కొత్తగూడెం మున్సిపాలిటీ చెందిన నలుగురు కౌన్సిలర్లు, 4ఇంక్‌లైన్ పంచాయతీ తాజా, మాజీ సర్పంచ్‌లు పలు పార్టీకు చెందిన నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే సాంబశివరావు సమక్షంలో సీపీఐ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాచర్ల రాజకుమారి, బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణ, నేరెళ్ల సమైక్య, కాశీ విశ్వనాథ్, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, బొంతు బాబూరావు, బొక్క శ్రీనివాస్, కర్ర వాసు, రామంచి శ్రీనివాస్, కుమార్, మద్దిపాక సుధాకర్, బుక్యా లాలు, ఎండీ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పనివేళల్లో మార్పు

సాక్షి ఎఫెక్ట్..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని సివిక్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పనివేళలు ఏరియా యాజమాన్యం శుక్రవారం ఎట్టకేలకు పనిగంటలను ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మార్పు చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల పనిగంటలు మార్చరా...? అని సాక్షి ప్రచురితమైన కథనానికి ఏరియా యాజమాన్యం స్పందించింది. రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణి వ్యాప్తంగా సివిక్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్పుచేశారు. దీంతోపాటు కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో కూడా ఈనెల 8 నుంచి పనివేళలను ఏరియా సివిల్ అధికారులు మార్పు చేశారు.

కానీ కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాకు కూత వేటు దూరంలో ఉన్న కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మాత్రం పనివేళలు మార్పు చేయలేదు. వెంటనే కాంట్రాక్ట్ కార్మికులకు పనిగంటలు మార్పు చేయామని కోరిన నేపథ్యంలో యాజమాన్యం ఎట్టుకేలకు శుక్రవారం పనిగంటల్లో మార్పు చేసింది. కార్పొరేట్ ఏరియా కంటే కొత్తగూడెం ఏరియాలో ఓసీల వలన సుమారు 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వీరికి కనీసం ఒక్కపూటైన మజ్జిగ పంపిణీ చేయాలని కోరారు.

ప్రధాని మోదీ పాలన అస్తవ్యస్తం



మాట్లాడుతున్న అయిలయ్య

ఇల్లెందురూరల్: సామ్రాజ్యవాదుల దోపిడీని అడ్డుకునేందుకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బండారు అయిలయ్య పిలుపునిచ్చారు. మండలంలోని రొంపేడు గ్రామంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల న్యూడెమోక్రసీ ముఖ్య కార్యకర్తల సమావేశం గుండాల ఎంపీపీ ముక్తి సత్యం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పదేళ్ల పరిపాలించిన నరేంద్ర మోదీ దేశ ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేశాడని ఆరోపించారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్‌తోపాటు నిత్యావసరాల ధరలు పెంచి పేదలు, మధ్యతరగతి వర్గాల ఆర్థిక స్థితిగతులను చిన్నాభిన్నం చేశాడని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడం, ప్రశ్నించే గొంతులపై కేసులు పెట్టి జైళ్లకు పంపడం మినహా పదేళ్లలో దేశానికి నరేంద్ర మోదీ చేసిందేమీ లేదన్నారు.

దేశమంతా కులమత, ప్రాంత అల్లర్లతో అతలాకుతలం అవుతోందని, భావిభారత పౌరుల మెదళ్లలో మతోన్మాద విషబీజాలు నాటి దేశాన్ని అస్థిరపర్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. సమావేశంలో నందగిరి వెంకటేశ్వర్లు, తుపాకుల నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, కొక్కు సారంగపాణి, సీతారాములు, సక్రు, కృష్ణ, డి.ప్రసాద్, లక్ష్మీనారాయణ, ప్రకాష్, లింగ్యా, తోడేటి నాగేశ్వరరావు, బొగ్గారపు సంగయ్య, నరాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును విస్తరించండి...



మంత్రి తుమ్మలతో ఇల్లెందువాసులు

ఇల్లెందు: పెరుగుతున్న ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఇల్లెందు – ఖమ్మం మధ్య ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం అత్యంత అవసరమని ఆ దిశగా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఇల్లెందువాసులు కోరారు. శుక్రవారం గండుగులపల్లిలో ఆయన నివాసం వద్ద మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నాయకులు కనగాల పేరయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బూడిదంపాడు వరకు డబుల్ రోడ్‌కు రూ.36 కోట్ల నిధులతో శంకుస్థాపన చేశారని, అదే రోడ్డును ఇల్లెందు వరకు కొనసాగించాలని కోరారు. ఇల్లెందు నుంచి లలితాపురం వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణంలో ఉన్నందున పూర్తి చేయాలని విన్నవించారు. గౌరిశెట్టి సత్యనారాయణ, ప్రభునాథ్, మల్లూరి శ్రీనివాస్, కొడారి రాజేందర్ ఉన్నారు.

రేపు అన్నదానం

జూలూరుపాడు: ఈనెల 14న అయ్యప్పస్వామి జయంతి సందర్భంగా కాకర్ల గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి సేవా సమితి సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్పభక్తులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా జూలూరుపాడు, వెంగన్నపాలెం తదితర గ్రామాల్లో అన్న ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సింగరేణిలో నగదు రహిత కౌంటర్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా సూపర్‌బజార్లలో ఇప్పటి వరకు నగదు రూపంలో లావాదేవీలు జరిగాయి. వీటి వలన కొంత అవకతవకలు జరుగుతున్న నేపథ్యంలో యాజమాన్యం నగదు రహిత కౌంటర్లు... ఆన్‌లైన్ పేమెంట్స్ ఫోన్‌పే, గూగుల్ పే, స్కానర్ తోపాటు ఇతర ఆన్‌లైన్ పేమెంట్‌ను రామగుండంలో అమల్లోకి తీసుకొచ్చామని, మిగతా సెంటర్లలో కూడా త్వరలో ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా) ఎన్వీకే శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ... ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, 2023–24లో వర్షాభావం తక్కువగా ఉండటం వలన 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమయిందన్నారు. ఈ సంవత్సరం సింగరేణి రెండు ఓసీలు ఆర్కే, జేకే ఓసీ మూతపడనున్నాయని, అదేవిధంగా ఆడ్రియాల ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం నడుసున్న గులాయిలు మూతపడ్డాయని, ఈ ప్రాంతంలో ఉన్న మిషనరీని గనిలోనే వేరే చోటుకు మార్చడం సుమారు ఆరు నులల ప్రక్రియ, ఈ నేపథ్యంలో ఈ మూడు గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందన్నారు. కొత్తగూడెం ఏరియాలోని వీకే–7 ఓసీ అనుమతుల కోసం తనతోపాటు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వరరెడ్డి, ఎస్టేట్స్, సీపీపీ జీఎంలు... ఎంఓఈఎఫ్ అధికారులను ఇప్పటికే ఏడుసార్లు అనుమతుల గురించి చర్చించినట్లు చెప్పారు. సింగరేణి పాఠశాలల్లో ఈ ఏడాది సీబీఎస్‌ఈని అమలు చేయడానికి వివిధ ఏరియాల నుంచి సీబీఎస్‌ఈలో చేరే విద్యార్థుల నుంచి అభిప్రాయ సేకరణ చేయనున్నామని తెలిపారు. వీకే–7ఓసీ అనుమతుల ప్రక్రియ పూర్తయితే ఓబీ టెండర్‌ను సిద్ధ చేసినట్లు పేర్కొన్నారు. సింగరేణి సూపర్‌బజార్‌లో సేల్స్ పెంచటానికి, రోజుకు 14 గంటలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

‘వేసవి’ జాగ్రత్తలు పాటించాలి



ఫ్లెక్సీ వద్ద కార్యదర్శి మల్లేష్, పంచాయతీ సిబ్బంది

ఇల్లెందురూరల్: వేసవి జాగ్రత్తలు తీసుకుంటూ వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ మండలంలోని ఒడ్డుగూడెం గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విస్తతంగా ప్రచారం చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి తేపల మల్లేష్ శుక్రవారం గ్రామపంచాయతీ పరిధిలోని పలు కూడళ్లలో వేసవి జాగ్రత్తలను సూచిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతం కంటే మిన్నగా ఎండలు మండుతున్నందున ప్రజలను అప్రమత్తం చేయడంలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి జాగ్రత్తలు సూచిస్తున్నామని వివరించారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



చిరుతానిపాడు గ్రామంలో ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న ఆదివాసీ గిరిజన గ్రామాలకు కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరించారు. మండలంలోని చిరుతానిపాడు గ్రామ గిరిజనులకు తాగునీటి కోసం నిత్యం మైళ్లదూరం కాలినడక వెళ్లి వాగుల్లో నీళ్లు తెచ్చుకుంటూ అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో ట్యాంకర్ ద్వారా గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి తెలిపారు.

ఆదివాసీ గ్రామాలను సందర్శించిన ఎంపీడీఓ
మండల పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలో నివాసం ఉంటూ తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ఆదివాసీ గిరిజన గ్రామాలైన చిరుతానిపాడు, పెద్దకల, రాళ్లచెలక గ్రామాలను శుక్రవారం ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలావతి సందర్శించారు. తాగునీటి బోర్ల నిర్మాణం కోసం పాయింట్లను గుర్తించారు. రెండు రోజుల్లో ఆయా గ్రామాల్లో తాగునీటి బోర్లను నిర్మాణం చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

తండ్రి కర్మకాండలకు భిక్షాటన



ఎమ్మెల్యే కనకయ్య నివాసంలో గణేషన్న

ఇల్లెందు(టేకులపల్లి): తండ్రి కర్మకాండల ఖర్చుల కోసం మాజీ దళకమాండర్ కోరం వెంకటేశ్వర్లు అలియాస్ గణేషన్న భిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 14 సంవత్సరాల పాటు అజ్ఞాతంలో ఉండి దళకమాండర్‌గా పోరాటాలు నిర్వహించిన గణేషన్న సిద్ధాంతం ఆచరణ విభేదాల కారణంగా 2016లో మధు వర్గంలో చేరాడు. జన జీవన స్రవంతిలో కలిసిన తరువాత పోడు సాగుదారుడిగా వ్యవసాయం చేస్తూ అప్పులు తీర్చుకున్నాడు. గణేషన్న తండ్రి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో 35 సంవత్సరాల పాటు పని చేశాడు. ఇటీవల ఆయన మృతి చెందారు. ఈనెల 20న గణేషన్న తండ్రి కోరం జగ్గయ్య సంస్మరణ కార్యక్రమం నిర్వహించేందుకు ఊరూరా భిక్షాటన చేయడం ప్రారంభించారు. ఇందులో భాగంగానే శుక్రవారం టేకులపల్లి మండలంలో భిక్షాటన చేశారు. కోయగూడెంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. తన తండ్రి సంస్మరణ కార్యక్రమానికి అవసరమయ్యే ఖర్చుల కోసం దాతలు ముందుకు రావాలని ఎవరైనా దయామయులు 9494397016 నంబర్‌కు ఫోన్ పే ద్వారా ఆర్థిక సాయం అందించాలని గణేషన్న దాతలను కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉపశమనం

- వేసవి దృష్ట్యా సిబ్బందికి మజ్జిగ పంపిణీ
- ‘గూడెం’లో రోజూ 150 మందికి అందజేత
- అటు ప్రయాణికులకూ చల్లని తాగునీరు



ఆర్టీసీ సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న డీఎం వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: మండుతున్న ఎండల దృష్ట్యా ఆర్టీసీ గతేడాది మాదిరిగానే ఈసారి కూడా సిబ్బంది శ్రేయస్సు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులకు వేసవిలో వడదెబ్బ వంటి ఇబ్బందులు తలెత్తకుండా మజ్జిగ పంపిణీకి అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రతీరోజూ డిపో పరిధిలో విధులకు హాజరయ్యే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో పాటు ఇతర గ్యారేజీలో పనిచేస్తున్న సిబ్బందికి 15 రోజులుగా మజ్జిగ ప్యాకెట్లను క్రమం తప్పకుండా అందిస్తున్నారు. వీటిని కార్మికులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య అందజేస్తున్నారు. కొత్తగూడెం డిపో పరిధిలో మొత్తం 230 మంది సిబ్బంది ఉండగా, రోజువారి 150 మంది కార్మికుల విధులకు హాజరవుతున్నారు. వీరందరికీ డిపోలోని ప్రత్యేక కేంద్రాల ద్వారా అధికారులు మజ్జిక ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. ఒక్కో కార్మికుడికి రెండు 250 మి.లీ మజ్జిక ప్యాకెట్లను అందజేస్తున్నారు. వీటి ధర రూ.10 వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రత్యేకంగా తయారు చేసిన ఈ మజ్జిగ ప్యాకెట్లను స్వీకరిస్తున్న కార్మికులు వేసవి తాపం నుంచి శరీరానికి తగిన చల్లదనం ఉంటుందంన్నారు. దీంతో పాటు ఆర్టీసీ ప్రయాణికుల దప్పిక తీర్చేందుకు ఆర్టీసీ వాటర్ కూలింగ్ యంత్రాల ద్వారా తాగునీరు నీరందిస్తోంది. ప్రయాణికుల రద్దీ ఉండే కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు బస్టాండ్లలో ప్రయాణికులు చల్లని తాగునీరును అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి ఏడాది రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. కొన్నేళ్లుగా గరిష్ట ఉష్ణోగ్రతలు జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో నమోదవుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే ఈ నెలలో 44.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు కొత్తగూడెం గరిమెళ్లపాడులో నమోదయ్యాయి. పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు మజ్జిగ పాకెట్లను పంపిణీతో పాటు వాటర్ కూలింగ్ యంత్రాలను అందుబాటులోకి తేవడంతో ప్రయాణికులు, సిబ్బందికి వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో వాటర్ కూలింగ్ యంత్రాలు అందుబాటులో ఉండటంతో ప్రయాణికుల వేసవి దాహార్తిని తీర్చుతున్నాయి.

ఉపశమనం లభిస్తోంది..



వేసవి దృష్ట్యా అంతటా ఎండల తీవ్రత పెరిగింది. కొత్తగూడెం డిపోలో పదహేను రోజులుగా అధికారులు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేకంగా తయారు చేసి ప్యాకెట్ల ద్వారా అందిస్తున్న మజ్జిగ రుచిగా ఉంది. కొంతవరకు ఉపశమనం పొందుతున్నాం.

– పీవీ ప్రసాద్, ఆర్టీసీ డ్రైవర్, కొత్తగూడెం

రోజూ 150 మందికి మజ్జిగ పంపిణీ



వేసవిలో ఆర్టీసీ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్నాం. గతేడాది కూడా పంపిణీ చేశాం. మంచి స్పందన వచ్చింది. కొత్తగూడెం డిపోలో రోజువారీ విధులకు వచ్చే 150 మందికి మధ్యాహ్నం మజ్జిగ ప్యాకెట్లను అందిస్తున్నాం.

– బి.వెంకటేశ్వరరావు, డీఎం, కొత్తగూడెం